జిల్లా కలెక్టర్ లక్ష్మీ షాపై బదిలీ వేటు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీ షాపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసింది. తిరుపతి నుంచి బదిలీ అవుతున్న ఆయన ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని ఆదేశించింది. ఎన్నికల నిర్వహణను పురస్కరించుకొని సాధారణ బదిలీలో భాగంగా లక్ష్మీ షా తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే బాధ్యతలు తీసుకున్న ఆయన, టిటిడి ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విషయాన్ని దష్టిలో పెట్టుకున్న ప్రతిపక్షాలు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే కలెక్టర్ తీరుపై ఈసీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎన్నికల కమిషన్ తిరుపతి కలెక్టర్ లక్ష్మీషాతో పాటు కష్ణా జిల్లా కలెక్టర్ రాజబాబు, అనంతపురం కలెక్టర్ గౌతమిని బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు అందిన వెంటనే వీరు విధుల నుంచి తప్పుకోవాలని, మంగళవారం సాయంత్రం 5 గంటలకు వారి స్థానాల్లో కొత్తవారిని నియమించేందుకు ముగ్గురితో కూడిన ప్యానల్ ను ఎన్నికలు కమిషన్ పంపించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వీరు ఉన్న ఫలానా విధుల నుంచి వైదొలిగారు.

టె(పె)న్షన్..!

రెండు నెలలూ ఇంతేనా..!
మండు వేసవిలో సచివాలయాల వద్ద
ఇంటివద్దే ఇవ్వాలని ప్రతిపక్షాల పట్టు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సామాజిక పింఛన్ల పంపిణీ రాజకీయ ఎన్నికల స్టంట్‌గా మారింది. పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెట్టాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలే ఇందుకు కారణం. పింఛన్ల పంపిణీని ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని వైసిపి విమర్శలు గుప్పిస్తుండగా, సచివాలయ సిబ్బందితో చేయొచ్చు కదా అని టిడిపి నేతలు తిప్పి కొడుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈనెల పింఛన్ల పంపిణీని మూడో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. అయితే ఇంటికి తెచ్చిస్తారా? లేక పంచాయతీ కార్యాలయాల వద్దకు వెళ్లాలా అనే దానిపై ఇంకనూ స్పష్టత రాకపోవడంతో గందరగోళం నెలకొంది. వికలాంగులు, నడవలేని నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి మాత్రమే ఇళ్ల వద్ద పింఛన్లు ఇస్తారని, మిగిలిన వారు సచివాలయాల వద్దకే రావాలన్న చర్చ నడుస్తోంది.

తిరుపతి జిల్లాలో 2 లక్షల 72 వేల 448 మంది పింఛన్లు పొందుతున్నారు. అందులో 25 రకాల పింఛన్‌దారులు ఉన్నారు. వారికి నెలకు 8 కోట్ల 11 లక్షల 54 వేల రెండు వందల రూపాయలు ప్రతినెల పంపిణీ చేసేవారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 19 వేల 617 మందికి గాను ఐదు కోట్ల 97 లక్షల 74 వేల రూపాయలు పంపిణీ చేసేవారు. ఏప్రిల్ ఒకటో తేదీ వచ్చినా ఇప్పటివరకు పింఛన్ రాకపోవడంతో వికలాంగులు వితంతువులు వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి 50 ఇళ్లకూ ఒక్కో వాలంటీర్ను నియమించింది. వీరే ప్రతినెలా ఒకటో తేదీ ఉదయమే ఇంటికి తెచ్చి పింఛన్‌దారులకు సొమ్ము అందిస్తున్నారు. ఎన్నికల సమయంలో వాలంటీర్లు వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్కు ఫిర్యాదులు చేశాయి. దీంతో వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా ఎన్నికల కోడ్ ముగిసే వరకూ పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెట్టాలని ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో సామాజిక పింఛన్ల పంపిణీ వ్యవహారం ఎన్నికల స్టంట్గా మారిపోయింది. వద్దులకు అందే పింఛన్ సొమ్మును టిడిపి, జనసేన, బిజెపి అడ్డుకున్నాయంటూ వైసిపి పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది. అయితే పింఛన్ల పంపిణీని తాము అడ్డుకోలేదంటూ టిడిపి, మిత్రపక్షాలు అదేస్థాయిలో తిప్పికొడుతున్నాయి. మార్చి నెలాఖరుకు ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా సామాజిక పింఛన్ల పంపిణీ ఈ నెల మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ సాగుతుందని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఇంటికి తెచ్చిస్తారా.. పంచాయతీ కార్యాలయాల వద్దే పంపిణీ చేస్తారా అనేది ఇంకా స్పష్టత లేకుండాపోయింది. వాలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకూడదని, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవాలని తెలపడంపై పలుచోట్ల వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు సైతం దిగారు. పింఛన్ల వ్యవహారాన్ని వైసిపి ఎన్నికల ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటుందని స్పష్టమవుతోంది. అదే సమయంలో సచివాలయ సిబ్బందితో పింఛన్ల సొమ్మును ఇంటికెళ్లి ఇచ్చే అవకాశమున్నా ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదనే చర్చ సైతం నెలకొంది. పింఛన్దారులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి తెగ ఆరాట పడుతున్న పరిస్థితి కన్పిస్తోంది.

తిరుపతిలో నేటి నుంచి సచివాలయాల్లోనే : డిప్యూటీ కమిషనర్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం నుంచి పెన్షన్లు పంపిణీ చేస్తామని మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య 'ప్రజాశక్తి'కి తెలిపారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఉండే పెన్షన్‌దారులు ఆయా సచివాలయాలకు వచ్చి పెన్షన్లు తీసుకోవాలని కోరారు. పెన్షన్లు తీసుకోవడానికి లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు సచివాలయంలో కల్పిస్తున్నట్టు వెల్లడించారు.

మందులు కొనలేదు : సయ్యద్ గఫార్, క్యాన్సర్ రోగి



ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చే పింఛన్ డబ్బులతో మందులు కొనుగోలు చేసేవాడిని. అయితే ఈసారి పింఛన్ రాకపోవడం వల్ల మందులు కొనుగోలు చేయలేదు. నాకు 70 ఏళ్లు. ఎన్నికల కోడ్ కారణంగా మూడో తేదీ నుంచి సచివాలయాల వద్ద ఇస్తారని చెబుతున్నారు. ఇళ్ల వద్దకే ఇచ్చేలా చూడాలి. ఏప్రిల్, మే నెలల్లో ఒకటో తేదీనే ఇచ్చేలా సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. మాలాంటి వాళ్లకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

పింఛన్ కోసం వచ్చి...

వెంకటయ్య (80) ఫైల్‌ఫొటో

ప్రజాశక్తి- వెంకటగిరి

ఎపుడూ ఒకటో తేదీ ఇచ్చే పింఛన్ రాకపోవడంతో విషయం తెలుసుకుందామని సచివాలయానికి వెళ్లిన వెంకటయ్య (80) గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన తిరుపతి జిల్లా వెంకటగిరిలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబీకుల వివరాల మేరకు... వెంకయ్య చిన్న కుమార్తె బొడిచర్ల చిన్నమ్మ తిరుపతిలో ఉంటుంది. ఆమె వద్దనే ఉంటూ ప్రతినెలా వెంకటగిరికి వచ్చి పింఛన్ తీసకుని వెళుతుంటాడు. వెంకటయ్య ఒకటో తేదీ పింఛన్ కోసం తిరుపతి నుంచి వెంకటగిరికి వెళ్లి మొదట వాలంటీర్‌ను కలిసాడు. అయితే వాలంటీర్లు ఇవ్వడం లేదని, సచివాలయంలో ఇస్తారని చెప్పడంతో మండుటెండలోనే సచివాలయానికి వెళ్లాడు. మూడో తేదీ నుంచి ఇస్తామని చెప్పడంతో వెంకటగిరిలోని స్వగృహానికి వెళ్లాడు. ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికి మృతిచెందాడు. ఆయనకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవని, పింఛన్ తీసుకుని రావడానికి వచ్చారని తెలిపారు. బంగారుపేటలోని ప్రాథమిక పాఠశాల వీధిలోని ఆయన స్వగృహంలో మంగళవారం అంత్యక్రియలు జరిగాయి. వెంకటగిరి వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి రాంకుమార్‌రెడ్డి ఇది ప్రతిపక్షాల వల్లే జరిగిందని, పింఛన్ అందలేదని మృతిచెందాడని మీడియాకు తెలిపారు. టిడిపి మాజీ ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు అంతమంది ఉండగా ఇంటింటికి వెళ్లి ఎందుకు పింఛన్ ఇవ్వలేదని, అధికార పార్టీ చేతగానితనం వల్లే ఇది జరిగిందని మండిపడ్డారు. ఇంటి వద్దనే పింఛన్ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఇంటివద్దనే పింఛన్లు ఇవ్వాలి : టిడిపి, జనసేన

శ్రీకాళహస్తిలో... ఇంటివద్దనే పింఛన్లు ఇవ్వాలని శ్రీకాళహస్తి జనసేన జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విభాగాల్లో లక్షల మంది అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, వారి ద్వారా ఇంటింటికి వెళ్లి నగదు అందజేయాలన్నారు. ఈనెల 5లోపు పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు.

- వెంకటగిరిలో మున్సిపల్ కమిషనర్‌కు మాజీ ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. లబ్దిదారులకు ఇంటివద్దనే పింఛన్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

- తిరుపతిలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు గొల్ల నరసింహయాదవ్ ఆధ్వర్యంలోకలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వలంటీర్లకు బదులుగా ప్రభుత్వ సిబ్బందితో పింఛన్‌దారులకు ఇంటి వద్దనే చెల్లించాలని కోరారు. ఖజానాలో డబ్బు అంతా జగన్‌రెడ్డి కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం వల్లనే పింఛన్ ఇవ్వడం లేటయ్యిందన్నారు. ఆర్‌సి మునిక్రిష్ణ, రవినాయుడు, బిజి కృష్ణ యాదవ్, పుష్పావతి, సింధుజ, చేజర్ల మనోహర్ ఆచారి పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ ఆధ్వర్యంలో టిపిఒకు వినతిపత్రం అందజేశారు.

పిచ్చాటూరులో.. మండలాధ్యక్షులు తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిడిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

తిరుపతిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తూ..

కనపర్తి శ్రీనివాసులు (వాసు) చంద్రగిరి

పోతుగుంట రాజేష్ శ్రీకాళహస్తి

గాడి తిలక్‌బాబు, సూళ్లూరుపేట

బాల గురవం బాబు సత్యవేడు

చిల్లకూరు వేమయ్య, గూడూరు

కాంగ్రెస్ అభ్యర్థులు వీరే..!

తిరుపతి, వెంకటగిరి పెండింగ్
ఐదుచోట్ల ప్రకటించిన అధిష్టానం
త్రిముఖ పోటీకి రంగం సిద్ధం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సార్వత్రిక, ఎపిలో సాధారణ అసెంబ్లీ ఎన్నికలకు మూడో కూటమి (ఇండియా వేదిక) ఎన్నికల సమరానికి సై అంది. తిరుపతి, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు మినహాయించి చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అభ్యర్థులను ఇడుపులపాయలో రాష్ట్రవ్యాప్త జాబితాలో భాగంగా ప్రకటించారు.చంద్రగిరి అసెంబ్లీకి డాక్టర్ కనుపర్తి శ్రీనివాసులు (వాసు)ను ప్రకటించారు. 2019 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. డాక్టర్ వృత్తి చేసుకుంటూ చంద్రగిరి మండల కేంద్రం కొత్తపేటలో నివాసం ఉంటున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేస్తున్నారు. అలాగే శ్రీకాళహస్తి అసెంబ్లీకి ట్రస్టు బోర్డు ఛైర్మన్ పోతుగుంట గురవయ్యనాయుడు (లేట్) కుమారుడు పోతుగుంట రాజేష్‌నాయుడును ప్రకటించారు. డాక్టర్ వృత్తిని ఎంచుకున్న ఆయన వివిధ వ్యాపారాలు ఉన్నాయి. శ్రీకాళహస్తిలో స్థిర నివాసం ఉంటున్నారు. సత్యవేడు నియోజకవర్గం అభ్యర్థిగా బాల గురవం బాబును ప్రకటించారు. చెన్నయ్‌లో వ్యాపారాలు చేసుకుంటున్న ఆయన సత్యవేడు మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ అభ్యర్థిగా గాడి తిలక్‌బాబును ప్రకటించారు. నాయుడుపేట వాస్తవ్యులు. బిఎస్‌సి, ఎల్ఎల్‌బి చేసి హైకోర్టులో న్యాయవాది వృత్తిలో ఉన్నారు. గూడూరు నియోజకవర్గంలో పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన చిల్లకూరు వేమయ్యకు టిక్కెట్ ఇచ్చారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి కాంగ్రెస్‌వాదిగా ఉన్నారు. చిల్లకూరు మండల పరిషత్ ఎంపిటిసిగా గెలుపొంది ప్రస్తుతం తిరుపతి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

చంద్రగిరిలో సంబరాలు

ఇండియా కూటమి సంపూర్ణ మద్దతుతో...
తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పి.అంజయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఇండియా కూటమి సంపూర్ణ మద్దతుతో తిరుపతి నుండి ఎంపీగా పోటీ చేస్తున్నానని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య వెల్లడించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా వామపక్షాలతో కలిసి ఎన్నో ప్రజా ఉద్యమాలను నడిపించిన అనుభవంతో తిరుపతి ఎంపీ అభ్యర్థిత్వానికి ఇండియా కూటమి సమ్మతించిందన్నారు. ఇండియా కూటమిలో ఉన్న సిపిఎం, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలను కలిసి తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశానన్నారు. కేంద్రంలోని మతతత్వ పార్టీ అయిన బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఆర్సి, సిఎఎ లను దశలవారీగా అడ్డుకుంటూ ఉద్యమించానన్నారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని తిరుపతి పార్లమెంటు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గొడుగు చింత గోవిందయ్య, సుబ్రమణ్యం, మేకల బాబు పాల్గొన్నారు.

నీటిని వృథా చేస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వేసవిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున నగర ప్రజలు నీటిని వృథా చేయకుండా, పొదుపుగా వాడుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ చెప్పారు. తిరుపతి నగరపాలక సంస్థ తాగునీటి అవసర నిమిత్తం తెలుగుగంగ(కైలాసగిరి రిజర్వాయరు), కళ్యాణి డ్యాం, 388 పవర్ బోర్ వెల్స్, 226 చేతి పంపుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. వర్షాభావ పరిస్థితి వలన రాబోవు మూడు నెలల్లో తెలుగుగంగ, కల్యాణిడ్యాం నిల్వలు పూర్తిగా ఖాళీ అయ్యే ప్రమాదం ఉందన్నారు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నగర ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రోడ్లు కడగడం, వాహనాలు ఇంటి ముందు కడగడం చేయరాదన్నారు. పాదచారులకు, వాహనదారుల సౌకర్యార్థం వేసవి దృష్ట్యా చలివేంద్రాలను నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. 'సేవ్ వాటర్..సేవ్ ఫ్యూచర్' నినాదాన్ని ఆచరించాలన్నారు. సూచనలు పాటించని యెడల చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బిజెపికి ఓటేయడమంటే గొంతు కోసుకున్నట్లే : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

బిజెపికి ఓటు వేయడమంటే ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు వారి గొంతు వారే కోసుకోవడమేనని స్పష్టం చేశారు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. బిజెపి– టిడిపి – జనసేన పార్టీల కూటమికి మాదిగలు ఎందుకు ఓటు వేయాలో మందకృష్ణ మాదిగ చెప్పాలన్నారు. తిరుపతి వెంకన్న సాక్షిగా 2014 ఎన్నికల మానిఫెస్టోలో వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి నేటికి పదేళ్లు పూర్తవుతుందన్నారు. తీరా బిజెపి అధికారంలోకి వచ్చాక మాదిగలపై అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేశారన్నారు. వర్గీకరణ అంశంపై మోసం చేసిన బిజెపికి చంద్రబాబు మద్దతు పలకడం దారుణమన్నారు. వీరికి మందకృష్ణ మాదిగ తొత్తుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మణికంఠ రాజు, నాగయ్య, జానకిరామ్, సుకుమార్, గంగాధరం పాల్గొన్నారు.

ఆస్తి కోసం కన్నతల్లి గొంతు కోశారు

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)

ఆస్తి తగాదాతో కన్నతల్లి గొంతు కోసిన కసాయి కొడుకు ఘటన తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని అడవి కొడియంబేడు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు... రాజమ్మ(80)కు ఇద్దరు కుమారులు. ఆమెకు వ్యవసాయ భూమి 1.47 సెంట్లు ఉంది. మూడు భాగాలుగా విభజించి చిన్న కుమారుడైన కృష్ణారెడ్డికి 40 సెంట్లు, మిగిలిన భూమిని, తల్లి భాగము పెద్దకుమారునికి కలిపి 1.07 సెంట్లు రాసిచ్చింది. ఈ మేరకు పెద్ద కుమారుడు కొడుకైన హరిరెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చింది. తల్లి భాగంలో చిన్న కుమారుడికీ వాటా రావాలని మూడు నెలలుగా గొడవ పడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐకు రాజమ్మ, పెద్ద కొడుకు కుమారుడు హరిరెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రెండో కొడుకు కృష్ణారెడ్డి, అతని కొడుకులు పది నిమిషాల్లోనే ఇంటికి చేరుకుని మంగళవారం మధ్యాహ్నం రాజమ్మతో గొడవపడి కిరాతకంగా గొంతుకోసి చంపి పరారయ్యారు. సిఐ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ రాజమ్మను హత్య చేసిన ముద్దాయిలు చిన్న కుమారుడు కృష్ణారెడ్డి, కోడలు గౌరీ, మనవళ్లు ఇలంగో, పురుషోత్తంలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులు పరారీలో ఉన్నారు.

కిరాతకంగా నరకడంతో తల్లి మృతదేహం



'ముర్రుపాలు'కు మోక్షం

- నేడు 'మిల్క్ బ్యాంకు' ప్రారంభం
- దాతృత్వం చాటుకుంటున్న రోటరీ క్లబ్
- తల్లిపాలే ముద్దంటున్న వైద్యులు

ప్రజాశక్తి-తిరుపతి

' డబ్బా పాలొద్దు...తల్లిపాలే ముద్దు ' అనే నినాదం ఇకపై నిజం కానుంది. కళ్లు తెరవగానే తల్లి 'పాల'కు దూరం కావాల్సిన అవసరం లేదు. రాయలసీమకే వైద్యరంగంలో తలమానికంగా నిలుస్తున్న తిరుపతి ప్రసూతి ఆసుపత్రిలో ఇకపై ముర్రుపాలూ లభ్యం కానున్నాయి. రోటరీ క్లబ్ దాతృత్వంతో రూ.30 లక్షల వ్యయంతో ప్రభుత్వ మెటర్నటీ వైద్యశాలలో బుధవారం ఉదయం ప్రారంభమయ్యే ' రోటరీ హ్యూమన్ మిల్క్ బ్యాంకు ' ఇకపై తిరుపతి ప్రాంత పసిబిడ్డలకు కల్పతరువు కానుంది. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, రోటరీ క్లబ్ డిస్టిక్ గవర్నర్ ఉదయ్‌కుమార్ భాస్కర, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీహరి, సుసేన హెల్త్ ఫౌండేషన్ సెక్రటరీ సంతోష్‌కుమార్ క్రాలేటి, మెటర్నటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ జి పార్థసారథితో పాటు తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్ హాజరుకానున్నారు.

పుట్టగానే తల్లిపొత్తిల్లో ఒదిగి ముర్రుపాలు తాగాల్సిన బిడ్డలు దాదాపు 60 శాతం మంది తల్లిపాలకు నోచుకోవడం లేదని పలు సర్వేలు బహిర్గతం చేస్తున్నాయి. పుట్టిన వెంటనే ఇవ్వాల్సి ఉండగా రెండు మూడు రోజులు గడిచినా ఇవ్వడం లేదు. మొదటి ఆరునెలల వరకు తల్లిపాలు తాగుతున్న వారు కేవలం 46 శాతమే. పుట్టినప్పటి నుంచి కనీసం ఆరునెలలకు మించి ప్రతి తల్లి తమ బిడ్డలకు పాలు ఇవ్వాలి, కానీ ఆరునెలలు అటుంచితే ఆరు నిమిషాలు కూడా తల్లిపాలకు నోచుకోని చిన్నారులెందరో ఉన్నారు. కొన్ని సార్లు సిజేరియన్ వల్ల పిల్లలకు పుట్టగానే పాలు దక్కడం లేదు. దీంతో ఆ పిల్లలు అమ్మపాల రుచికి దూరమవుతున్నారు. ఉద్యోగం చేసే మరి కొందరు తల్లులు మొదటి ఆరు నెలలు తల్లిపాలు సంపూర్ణంగా ఇవ్వలేకపోతున్నారని పేర్కొంటున్నారు.

ముర్రుపాలతోనే బిడ్డకు రోగ నిరోధక శక్తి

పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇస్తే బిడ్డకు రోగ నిరోధక శక్తి ఏర్పడుతుందని తిరుపతి రుయా వైద్యురాలు అరుణ పేర్కొంటున్నారు. చిక్కగా పసుపు రంగులో ఉండే ముర్రుపాలలో కొలోస్ట్రమ్ ఉంటుందని చెబుతున్నారు. ముర్రుపాలను కొందరు పిండిపారపోస్తారని, అది సరైనది కాదని వైద్యులు అంటున్నారు. పౌష్టికరం, బలవర్ధకమైన ముర్రుపాలు తాగేది కొందరు మాత్రమే. పుట్టిన గంటలోపు తల్లిఒడికి చేరడం లేదు. దీంతో ముర్రుపాలు దక్కడం లేదు. ఆస్పత్రుల్లో ఆలస్యంగా బిడ్డ తల్లిఒడికి చేరుతుంది. స్నానం పేరుతో వైద్యపరీక్షల పేరుతో కొందరు బిడ్డను తల్లి ఒడికి చేర్చడం లేదు. తిరుపతిలో ఇటీవల ఓ స్వచ్ఛంధ సంస్థ నిర్వహించిన సర్వేలో కేవలం 60 శాతం మాత్రమే పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగుతున్నట్లు తేలింది. అయితే వైద్యుల అంచనా ప్రకారం 36 శాతమే మాత్రమే చిన్నారులు ముర్రుపాలకు నోచుకుంటున్నట్లు స్పష్టం చేస్తున్నారు. మహిళల్లో రొమ్ముక్యాన్సర్ పెరగడానికి తల్లిపాలు ఇవ్వకపోవడమేనని వైద్యులు పేర్కొంటున్నారు. తల్లిపాలు ఇస్తే రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, రక్తహీనత, ఎముకల బలహీనత నుంచి రక్షణ, సహజ గర్భనిరోధక శక్తి, అధిక బరువు వంటి సమస్యల నుంచి కాపాడుకోవచ్చని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం బ్రెస్టు క్యాన్సర్ పెరగడానికి 30 శాతం తల్లిపాలు ఇవ్వకపోవడమేనని వైద్యులు వివరిస్తున్నారు. తల్లిపాలు రెండేళ్లపాటు నిరంతరంగా ఇస్తే శిశువులో వ్యాధినిరోధక శక్తి విశేషంగా పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ఆ తల్లిలోనూ గర్భనిరోధక శక్తి పెరుగుతుందని, దీని వల్ల వెంటనే గర్భం రాకుండా నివారించే అవకాశాలు ఉన్నాయని డాక్టర్లు చెబుతున్నారు.

సిజేరియనూ కారణమే !

ఆస్పత్రుల్లో డెలవరీల్లో 40 శాతం సిజేరియన్ అవుతున్నాయి. ఆపరేషన్ తర్వాత బిడ్డలను తల్లివద్దకు వెంటనే చేర్చడం లేదు. దీంతో శిశువు పుట్టిన గంటలో తల్లిపాలకు నోచుకోవడం లేదు. జిల్లాలో ప్రతి ఏడాదీ దాదాపుగా 2.30 లక్షల మంది జన్మిస్తున్నట్లు సమాచారం. ఇందులో దాదాపుగా 70 వేల మందికి పుట్టిన గంటలో తల్లిపాలకు నోచుకోవడం లేదు. వీరిలో ఎక్కువ శాతం సిజేరియన్‌తో పుట్టిన వారే. తల్లి ఐసియులో ఉంటే, బిడ్డ ఇంక్యుబెటర్‌లో ఉంటున్నారు. ఇలా రెండు మూడు రోజుల వరకు పిల్లలు తల్లిపాలకు నోచుకోవడం లేదు. మరికొన్ని ఘటనల్లో బిడ్డలు బరువు తక్కువ, నెలలు నిండక పోవడం వల్ల కూడా తల్లిపాలకు నోచుకోవడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. పాలపౌడర్, పాలపీపాలతో కొన్నిసార్లు ప్రమాదం పొంచి ఉంటుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. బ్రాండెడ్ కంపెనీకి సంబంధం లేని పాలడబ్బాలు, పాలపీపాల వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నట్లు పలు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. కొన్ని ప్లాస్టిక్ బాటిల్స్, పాల పీపాలతో ప్రమాదం పొంచి ఉందంటున్నారు.

రెండేళ్లపాటు తల్లిపాలే ఇవ్వాలి : డాక్టర్ ఈశ్వరయ్య,
ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, రుయా ఆసుపత్రి, తిరుపతి

పుట్టిన బిడ్డకు రెండేళ్లపాటు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి. బిడ్డ పుట్టగానే చుక్కపాలు కూడా వృధా చేయకుండా వెంటనే ఇవ్వాలి. మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు తప్ప ఆవు, బర్రె, డబ్బాపాలనూ ఇవ్వొద్దు. ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు ఇంట్లో తయారు చేసిన తేలికపాటి ఆహారం ఇవ్వాలి. పాలను పిల్లలకు ఇక వ్యాక్సిన్‌గా ఇవ్వాలి. పాలు ఇవ్వడం వల్ల అది వారికి ఒక రక్షగా ఉంటుంది. పాలు తాగిన పిల్లలకు 500 కేలరీల శక్తి వస్తుంది. చాలామంది అపోహతో బిడ్డకు పాలు ఇవ్వడం లేదు. తల్లిపాలు తాగే బిడ్డ పుట్టిన సమయంలో ఉండే బరువు, అయిదు నెలల వయస్సు వచ్చేవరికి రెట్టింపు పెరుగుతారు. అదే ఏడాదికి మూడు రెట్లు అధిక బరువు పెరుగుతారు. దీన్ని గుర్తించి తల్లులూ ఇకపై దాతృత్వం చాటుకుని పాలను దానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'బియ్యం'కు చికెన్, గుడ్లు తిరిగి ఇచ్చేస్తాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కరోనా కాలంలో ముస్లింలకు ఉచితంగా అందజేసిన చికెన్, కోడిగుడ్లు, కూరగాయలను తన రాజకీయ ప్రచారం కోసం వాడుకుంటున్నారనీ, ఆయనకు అవి తిరిగి ఇచ్చేస్తామని టీడీపీ మైనార్టీ విభాగం ముస్లిం నాయకులు అన్నారు. సోమవారం ముస్లింలు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా చికెన్, గుడ్లు, కూరగాయలు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కరోనా సమయంలో తమకు చికెన్ గుడ్లు పంచి పెట్టాను అని, గత నాలుగు సంవత్సరాల నుంచి చెప్పిందే చెబుతూ అన్ని వేదికల పైన ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నాడని, దానిని రాజకీయంగా వాడుకుంటున్నారని విసుగు పుట్టి తిరిగి ఇచ్చేస్తున్నామన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్కసారి చికెన్ , గుడ్లు ఇవ్వడం తప్ప మైనారిటీల కోసం పెద్దగా ఏమీ చేయలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నారు కాబట్టి సాయం చేశారని, దాన్ని రాజకీయానికి వాడుకోవడం సిగ్గుచేటన్నారు.

రేపు రేణిగుంటకు జగన్ బస్‌యాత్ర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈనెల 4వ తేదీన రేణిగుంట నుండి జగన్ బస్సు యాత్ర శ్రీకాళహస్తి మీదుగా నాయుడుపేటకు చేరుకుంటుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీఎం జగన్ బస్సు యాత్ర గురువారం ఉదయం 9 గంటలకు రేణిగుంట, గురవరాజు పల్లి వద్ద ఉన్న ఎఫ్‌సిఐ గొడౌన్ నుండి ప్రారంభం అవుతుందని, అనంతరం భారీ బైక్ ర్యాలీ మధ్య ఏపీ సీడ్స్ కూడలికి చేరుకుంటుందన్నారు. అనంతరం తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం వద్ద లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లతో జరిగే సమావేశంలో జగన్ పాల్గొంటారని తెలిపారు. బస్సు యాత్ర ప్రారంభం మొదలు వీడ్కోలు పలికే వరకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మిద్దెల హరి, లోకేష్ యాదవ్, గోరా, పఠాన్ ఫరీద్, పసల సుమతి పాల్గొన్నారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కెవిబిపురం: కెవిబిపురం మండల కేంద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆ బ్యాంకు మేనేజర్ సాయి తెలిపారు. బ్యాంకు సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని ప్రతి గడపకూ వెళ్లి బ్యాంకు అందించే సేవలను కరపత్రాల ద్వారా మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బ్యాంకు ఖాతాదారులకు ఏటీఎం, ఫోన్‌పే సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని, ఇక నుంచి సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులకు ఏటీఎం, ఫోన్‌పే సౌకర్యాలు అందిస్తున్నామని ప్రతి వినియోగదారుడూ ఈ సేవలను వినియోగించుకుని సులభంగా నగదు లావాదేవీలు చేసుకోవచ్చని తెలిపారు. బంగారుపై రుణాలు, పర్సనల్ లోన్స్ ఇస్తామని తెలిపారు.

ఘనంగా పీఎస్సార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసిపి నేత, పారిశ్రామిక వేత్త పొనకా శివకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, పీఎస్సార్ సంస్థల ఉద్యోగులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛఆంధ్ర ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మతో కలిసి శివకుమార్ రెడ్డి కేక్ కట్ చేశారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు, నాయకులు, ఉద్యోగులు పూల బొకేలు అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి వారందరికీ శివకుమార్ రెడ్డి కేక్‌ను అందించారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోదండ రామయ్య, గోపాల్ యాదవ్, శాంతి, సురేష్ రెడ్డి, చిన్నా, ముని, సాయి, హాషిమ్, ఇమ్రాన్, కబీర్, వాసుదేవ రాజుతో పాటు శివాబి కేబుల్ ఆపరేటర్లు కాళపరెడ్డి, చల్లా శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. దగ్గోలు మల్లికార్జున రెడ్డి వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు దగ్గోలు కిషోర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, రాము, కుమార్‌నాయుడు, పిల్లిల శీను, ఆక్వా రమేష్, పోతిరెడ్డి పెంచలయ్య, సంచి మునిప్రసాద్, నాగరాజు, కృష్ణా ఒడ్డి, కార్య నిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

ఈ ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరుపతి సబ్ డివిజన్, అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పరపాలెం, శెట్టిపల్లి గ్రామాల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను చైతన్యవంతులను చేసేందుకు కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు సిబ్బంది మంగళవారం కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా, ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే ధ్యేయంగా పోలీసుల కవాతు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అలిపిరి ఎస్సైలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, బిఎస్‌ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

రామచంద్రాపురం: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం లోని రామచంద్రాపురం మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో స్థానిక ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. మంగళవారం ఎన్నికల అధికారి గుర్తించిన సమస్యాత్మక గ్రామాలు కుప్పం బాదూర్, రాయల చెరువు పేట, పరమల, కోతకండ్రిగ గ్రామాలలో కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చునని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. మండలంలో సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరగాలని, ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేషు, ధన, త్యాగ, యోబు, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి పుష్పయాగానికి అంకురార్పణ

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి):

శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగానికి ఏప్రిల్ 3వ తేదీ సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఆలయంలో ఫిబ్రవరి 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 4న ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి సంపంగి, రోజా, కలువలు వంటి పలురకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. శ్రీవారి పుష్పయాగాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 3న అష్టోత్తర శతకళశాభిషేకం, ఏప్రిల్ 4న తిరుప్పావడ, నిత్య కల్యాణోత్సవం సేవను టీటీడీ రద్దు చేసింది.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి): '

మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా పులివర్తి వినీల్ శ్రీనివాసమంగాపురంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారికి పులివర్తి వినీల్ పలు సూచనలు అందించారు. తాము అధికారంలో కొస్తే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. టిడిపి కూటమి అభ్యర్థి పులివర్తి నానికి ఒక సారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో వరప్రసాద్..

బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి పార్లమెంట్ బిజెపి ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో మంగళవారం ఉదయం పర్యటించారు. మండలంలోని టిడిపి ఉమ్మడి పార్టీల నాయకులను కలిశారు. అనంతరం నెల వాయి గ్రామపంచాయతీ టిడిపి ఎంపీటీసీ మనోహర్ నాయుడు నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి లావణ్య కుమార్, బిజెపి నాయకుడు మునిచంద్రారెడ్డి, మండల జనసేన అధ్యక్షులు బాష, శేఖర్ నాయుడు, గుర్రప్ప నాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జి దామా మునెయ్య, మండల ఐటీడీపి కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు జి లక్ష్మి శ మంగళవారం పరిశీలించారు. బిఎల్వో లు ఈవిఎం ఉపయోగించడంపై, వారి విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలు 2024 షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు జి లక్ష్మిశ తనిఖీ చేశారు. ఈ దఫా సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పూర్తి స్థాయి ప్రణాళికలతో ఈఆర్‌ఓ, ఎఈఆర్‌ఓలు, సెక్టోరల్ అధికారులు, పోలీస్ అధికారులు సమన్వయంతో అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిఎల్వోలు వారి విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి వుండాలని పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని చంద్రగిరి మండలం ఎ రంగంపేట గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన నాలుగు 111,112,113, 114 నెంబర్లు గల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం తొండవాడ గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 130, 131 పోలింగ్ కేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రంలోని 132వ నెంబరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్ కేంద్రం నుండి 100 మీటర్ల రేడియస్ పరిధిలో మార్కింగ్‌ను చెక్ చేసి రెడ్ కలర్ లో 100 మీటర్లు అనే వివరాన్ని ప్రస్ఫుటంగా కనిపించేలా రాయాలని సూచించారు. తిరుపతి రూరల్ పరిధిలోని తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 20 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి ర్యాంపు సక్రమంగా ఏర్పాటు ఉండాలని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ర్యాంపు, తాగు నీరు, మరుగుదొడ్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ లొకేషన్‌లో బయట, అందులో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రస్ఫుటంగా కనిపించేలా రాయించాలని ఈఆర్‌ఓ, ఎఆర్‌ఓ లను ఆదేశించారు. బిఎల్వోలు వారి విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్ పోల్ నిర్వహణ, పోలింగ్‌కు వచ్చే సిబ్బందికి ఏర్పాట్లు, ఈవిఎం ఆపరేషన్ పై, పోలింగ్ ముందు రోజు పోలింగ్ రోజు వారి విధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బిఎల్వో లను వారి ఎన్నికల విధులపై పలు ప్రశ్నలు అడిగి వారికి విధులపై అవగాహన కల్పించారు. జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా ఎన్నికల ప్రశాంత నిర్వహణకు చర్యలు చేపడుతామని అధికారులు అందరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, తహశీల్దార్ మారుతి, మహబూబ్ చాంద్, సెక్టార్ అధికారులు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మిశ

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ప్రజాశక్తి - బాలాయపల్లి :

ఇంట్లో కుటుంబ పెద్దలను ఎదిరించి ప్రేమ వివా హం చేసుకున్న ఓ యువ జంట పోలీసులను ఆశ్రయించిన ఘటన బాలాయపల్లి మండలం పాపి రెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వెంకటగిరి మండలం గొట్లగుంట గ్రామానికి చెందిన మౌనిక, బాలాయపల్లి మండలం గొల్లపల్లి పంచాయతీ పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుర్గాటి. పవన్ జేసీబి సూపర్ వైజర్ గా పనిచేస్తూ గత కొన్ని రోజులుగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలు వివాహానికి నిరాకరించడంతో ప్రేమ వివా హం చేసుకొని రక్షణ కోసం గూడూరు డివిజన్ డీఎస్పీ సూర్య నారాయణ రెడ్డిని, పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఇరు కుటుంబాలను బాలా యపల్లి ఎస్ఐ మహబూబ్ సాహెబ్ స్టేషన్ కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వధూవరులిద్దరూ మేజర్లు కావడంతో వారిని ఇబ్బంది పెట్టొద్దని కుటుంబ పెద్దలకు సూచించారు.

లడ్డూ బ్యాగులే రక్ష

ఎండ తీవ్రతకు భక్తుల ఆర్తనాదాలు

ప్రజాశక్తి -తిరుమల:

ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండడంతో తిరుమలతో పాటు ఇతర ప్రాంతాల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరుమలకు వచ్చే యాత్రికులు మాడవీధుల్లో పాదరక్షలు లేకుండా నడవాల్సి రావడంతో భక్తులు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. మండుతున్న మాడవీధి యాత్రికుల నుండి తమను తాము రక్షించుకోవడానికి టిటిడి అందించిన జనపనార సంచులను ఓ భక్త కుటుంబం కాళ్లకు కట్టుకుని లడ్డూలను తీసుకువెళ్లడం కనిపించింది.

అనారోగ్యంతో హోమ్‌గార్డు మృతి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:

వరదయ్యపాలెం మండలం పాండురు పంచాయతీ వెంగారెడ్డి కండ్రిగలో నివసిస్తూ బీఎన్ కండ్రిగ పోలీస్ స్టేషన్ లో హోమ్ గార్డుగా విధులు నిర్వహిస్తున్న యాకూబ్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. యాకూబ్ బుచ్చినాయుడు కండ్రికలో విధులు నిర్వహిస్తూ ఉత్తమ పోలీసుగా అందరి మన్ననలు పొందాడు. పోలీస్ స్టేషన్‌లోనూ క్రమశిక్షణతో పనిచేస్తూ పై అధికారి ఎస్ఐ వెంకట నరసింహం వద్ద ఎంతో మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయన మృతి తీరని లోటు అని బుచ్చినాయుడు కండ్రిగ పోలీసు స్టేషన్ ఉద్యోగులు పేర్కొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి -చిల్లకూరు: చిల్లకూరు మండలంలోని అత్యంత ప్రముఖమైన ముత్యాలమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు వివిధ సాంస్కృతిక, మంగళ వాయిద్య కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు పలువురి ఆకట్టుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ముత్యాలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మాదిగలకు టిడిపి సీట్లు కేటాయించాలి: ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గానికి టిడిపి సీటు కేటాయించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఎన్నికల సమయంలో మాదిగలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారు తప్ప మాదిగలకు పోటీ చేసే అవకాశం ఇవ్వడం లేదని నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదురు రత్నం పేర్కొన్నారు. గూడూరు హెడ్ పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ విగ్రహం వద్ద నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదురు రత్నం మాట్లాడుతూ సింగనమల నియోజక వర్గం నుండి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇచ్చారని, టిడిపి కూడా మాదిగలకు సీట్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ తిరుపతి అధ్యక్షులు గోవిందు శంకరయ్య, నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఆదూరు దామోదర్, రమణారావు, సునీత, ఏడుకొండలు, పృథ్వి, సుందరం, వెంకటేష్ పాల్గొన్నారు.

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -వెంకటగిరి: వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి సమక్షంలో పలువురు మంగళవారం వైసిపిలో చేరారు. వెంకటగిరి నియోజకవర్గ బాలాయపల్లి మండలం వెంగమాపురం గ్రామ టిడిపి క్రియాశీలక నాయకులు గురవయ్య, వెంకటరమణయ్య, వారి అనుచరులు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎన్ శేషమ నాయుడులు ఆ గ్రామ సర్పంచ్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. వీరికి నేదురుమల్లి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బాలాయపల్లి మండల వైసిపి నేతలు వి మధుసూదన్ రెడ్డి , జయంపు సొసైటీ అధ్యక్షులు వి కార్తీక్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, పల్లిపాటి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

రామచంద్రాపురం: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సమక్షంలో రామచంద్రాపురం మండలం రావిళ్లవారి పల్లి పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణ కాల్వ ఆది ఆరుంధతి వాడకు చెందిన పది కుటుంబాల వారు టిడిపి నుండి వైసిపిలో మంగళవారం చేరారు. తుమ్మలగుంట నివాసం వద్ద వీరికి తుడా ఛైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. బ్రాహ్మణకాల్వ ఆది ఆరుంధతి వాడ నుంచి వైసిపిలో చేరిన వారిలో గోవిందయ్య, ఎన్ సుబ్రహ్మణ్యం, ఎన్ బాబు, పి వెంకటేష్, ఎ అశోక్, సి నాగరాజు, జి బాబు, జి అఖిల్, జి లోకేష్, కె వెంకటేష్, కె చిన్న రాయుడు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల సీనియర్ నాయకులు భానుకుమార్ రెడ్డి, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎళ్లేపల్లి వెంకటేష్ , వైస్ ఎంపీపీ భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

7న పాకాలలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి -పాకాల:

ఈ నెల 7వ తేదీ పాకాలలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ చెస్ టోర్నమెంట్ పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ చెస్ ద్వారా విద్యార్థులు శక్తివంతులు అవుతారన్నారు. పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు మాట్లాడుతూ తిరుపతి చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సహాయ సహకారాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌ను ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు పాకాల ప్రభుత్వ హైస్కూలులో ప్రారంభిస్తు న్నామన్నారు. అన్ని వయసుల చెస్ క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన వచ్చని తెలిపారు. మొత్తం 50 వేల రూపాయల నగదు బహుమతులు వుంటాయని, వివిధ కేటగిరీలలో 52 మంది విజేతలకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్స్, మరో 20 మంది విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందించనున్నామని తెలిపారు. దీంతో పాటు క్రీడాకారులకు ఉచిత భోజన ఏర్పాట్లు చేస్తున్నామని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లను 'ఎపిచెస్.వొఆర్‌జి లింకు' ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు, నిర్వాహకులు విజయబాబు 8143337722, మహేష్ బాబు 9701401492 ఫోన్ నెంబర్లను సంప్రదించా లన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక దంత వైద్యశాల డాక్టర్ భువీందర్, బాలు పాల్గొన్నారు.

93 మంది ఫార్మసీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి -రామచంద్రాపురం:

ప్రాంగణ నియామకాలలో 93 మంది సెవెన్ హిల్స్ ఫార్మసీ విద్యార్థులు అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు తెలిపారు. మండలంలోని వెంకట్రామాపురం సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో అపోలో ఫార్మసీ కంపెనీ ప్రతినిధులు దుర్గాప్రసాద్, జగదీష్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంగణ ఎంపికలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల నుండి 123 మంది విద్యార్థులు హాజరయ్యారు. నియామకపు ప్రక్రియలో భాగంగా విద్యార్థు లకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి, అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపి క చేశామని అపోలో ఫార్మసీ సంస్థ ప్రతినిధులు దుర్గా ప్రసాద్ తెలిపారు. ఉద్యో గాలకు ఎంపికైన విద్యార్థు లకు సంవత్సరానికి 2లక్ష ల 40వేల రూపాయ లు వేతనంగా నిర్ణయిస్తూ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భం గా ప్రాంగణ నియామకాలలో ఎంపికైన సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులను కరస్పాండెంట్ ఎం సుమలత, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్న అపోలో ఫార్మసి కంపెనీ ప్రతినిధులు

రూ.13 వేల కోట్లు ఏమయ్యాయి జగన్?

టిడిపి బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం ఉమేష్ రావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ఖజానాను పతనం చేయడమే ఏకైక లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్ ఎన్నికల కోడ్ అమలులోకి రాబోతున్న కొద్ది రోజుల ముందు సుమారు రూ.13 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి మళ్లించారో చెప్పాలని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టరు ఎం ఉమేష్ రావు డిమాండు చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి పెన్షన్లు ఆపిందని ప్రచారం చేస్తూ జగన్ తన రాజకీయ లబ్ధి కోసం 15 రోజుల్లో రూ.13 వేల కోట్ల రూపాయలు తన కాంట్రాక్టర్లకు మళ్లించి ఖజానా ఖాళీ చేసి వృద్ధులను, వితంతువులను, వికలాంగులను మోసం చేశాడని ఉమేష్ ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిసినా ప్రభుత్వ ఖజానాలో పెన్షన్ డబ్బులు ఉంచకుండా జగన్‌మోహన్ రెడ్డి తన బినామీలకు ఇష్టారాజ్యంగా పంచిపెట్టడం దుర్మార్గమని సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి ఆరోపించారు. 'ఆర్‌బిఐ దగ్గర జగన్‌కి ఇప్పుడు అప్పు పుడితే తప్ప పెన్షన్లు ఇవ్వలేని దుస్థితికి ఆంధ్రప్రదేశ్‌ను దిగజార్చడానికి జగన్‌మోహన్ రెడ్డి కారణం కాదా ?' అని వారు ప్రశ్నించారు.

టిడిపి బిసి విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

జనసేనలో చేరిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుమల, తిరుపతిలోని రెండు వందల మందికి పైగా నాయి బ్రాహ్మణులు బుచ్చిబాబు నాయకత్వంలో జనసేనలో మంగళవారం చేరారు. జనసేన కూటమి అభ్యర్థి ఆరని శ్రీనివాసులు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయిబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి బుచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారి జనసేనలోకి నాయి బ్రాహ్మణులు తిరుపతిలో చేరారన్నారు. నాయి బ్రాహ్మణులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించాలన్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే తిరుపతిలో నాయిబ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని తెలిపారు. కూటమి అధి నాయకులతో చర్చించి టిటిడి బోర్డ్ మెంబర్‌గా నాయి బ్రాహ్మణులకు అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తిరుపతి నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల్లో నాయి బ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇస్తామని, టిటిడిలో ఖాళీగా ఉన్న క్షురకుల పోస్టుల భర్తీకి కృషి చేస్తామని, 854 మంది కాంట్రాక్టు క్షురకులను పర్మినెంట్ చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలోనూ నాయి బ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మధుబాబు పాల్గొన్నారు.

పింఛన్లు త్వరగా ఇవ్వండి..

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి త్వరగా పింఛన్లు అందించాలని టిడిపి రూరల్ నాయకులు మండల అభివృద్ధి కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు పాటిస్తూ వృద్ధులకు పింఛన్లు ఇవ్వాలని కోరారు. తమపై బురదచల్లే ఆరోపణలు మానుకోవాలన్నారు. 13 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నుండి దారి మళ్లించి కాంట్రాక్టర్లకు అప్పగిస్తోందన్నారు. ఖజానాలో డబ్బులు లేనందువల్ల పెన్షన్లు ఇవ్వడంలో ఆలస్యం చూపి తమను నిందించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి రూరల్ నాయకులు మగ్గం వెంకటాచలం, పులుకుల రాజేశ్వరరావు, ఆనంద్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : వృద్ధులకు, వికలాంగులకు, ఇతరులకు అందించాల్సిన పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా అందించేలా చర్యలు తీసు కోవాలని టీడీపి నాయకులు కోరారు. గూడూరు రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకు, గూడూరు పురపాలక కార్యాలయంలో కమిషనర్‌కు టీడీపి నాయకులు మంగళ వారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్‌ల విషయంపై వైసీపీ నాయకులు టీడీపిపై అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసరావు, బిల్లు చెంచురామయ్య, వాటంబేటీ శివకుమార్, వేదనపర్తి జనార్ధన్ రెడ్డి, తూపిలి సురేంద్ర, పిల్లెల శ్రీనివాసులు, రావుల శివప్రసాద్ గౌడ్, కస్తూరి గురవయ్య, పేపళ్ల అమరయ్య నాయుడు, ఆసనాపురం వెంకటేష్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని. టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్ ఆధ్వర్యంలో మున్సిపాల్టీ టీపీఓకి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు ఆర్ మాధవ నాయుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సి షణ్ముగ రెడ్డి, పుత్తూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ బిఆర్ యుగంధర్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ డిఎస్ గణేష్, 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి, టిడిపి నాయకులు విడి అశోక్, డిజి ధనపాల్, రాజా, పాల్గొన్నారు.

కోట : పింఛనదారులకు పింఛన్లు సకాలంలో పంపిణీ చేయాలని తిరుపతి జిల్లా టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ కోరారు. కోట మండల టిడిపి నాయకులతో కలిసి ఆయన ఎంపిడివో శంకరయ్యకు మంగళవారం వినతి పత్రం అందించారు. వెంటనే పింఛన్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి, వాకా విజయ బాస్కర్ రెడ్డి, మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, తీగల సురేష్, దారాసురేష్, తల్లం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల పుస్తక దినోత్సవం

బాలల పుస్తక దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- కెవిబి పురం: ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో కెవిబిపురం మండలం శ్రీనివాసపురం ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లల్లో పఠనాసక్తి పెంచడానికి పాఠశాలల్లో మినీ గ్రంథాలయం ఏర్పాటు చేసి వారి వద్ద పుస్తకాలు చదివించడం అలవాటు చేశా మన్నారు. పుస్తక పఠనం వల్ల బాలల్లో విజ్ఞానం పెంపొందుతుందని, చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మావుళ్లయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞానం పెంచుకోవడానికి గ్రంథాలయం ఎంతో ఉపయో గపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు అందించి చదివించారు. క్రమం తప్పకుండా పుస్తకాలు చదివించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, ప్రజా ప్రగతి ట్రస్ట్ సిబ్బంది వేణుగోపాల్, ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్ : వైసిపి విద్యార్థి విభాగం నాయకులు వి హరిప్రసాద్ రెడ్డి మంగళవారం మదనపల్లిలో బస్సు యాత్రలో వున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎన్నో సేవలందించారన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా పాఠశాలలను పునరుద్ధరించడంతో పాటు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టి పేద పిల్లలకు మంచి భవిష్యత్తు అందించారన్నారు. మళ్లీ జగన్ విజయానికి కృషి చేస్తే విద్యార్థులు, నిరుద్యోగులకు గొప్ప పథకాలు తీసుకొస్తారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో విద్యార్థి సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునుస్వామి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలం

మాజీ సర్పంచ్‌కి పితృ వియోగం

ప్రజాశక్తి - పిచ్చాటూరు:

ముడియూ రు మాజీ సర్పంచ్ దీన దయాల్ రెడ్డి తండ్రి మును స్వామి రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం ఉద యం మును స్వామిరెడ్డి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళు లర్పించి సంతాపం తెలిపారు. దీన దయాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి టిడిపికి క్రియాశీలకంగా వ్యవహరించిన మునుస్వామి మృతి పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇళంగోవన్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, మునిశేఖర్, తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.